తెలుగు జ్యోతి రచనలపోటీలో ప్రత్యే బహుమతి పొందిన
కథ  పురస్కార ప్రదాతల శ్రీమతి భావరాజు భారతి, బ్రిడ్జివాటర్, న్యూజెర్సీ.

# ప్రవల్లిక

*-భాను*

చేస్తున్న పని ఆపి ఒకసారి గడియారం వంక చూసాడు అభిజిత్. సాయంత్రం 5 గంటలయ్యింది. ఇక ఆ రోజుకి పని ముగించి బయలుదేరాడు. అభిజిత్ ఒక ప్రముఖ అడ్వర్టైజింగ్ కంపెనీకి అధిపతి. తన తెలివితేటలతో, శక్తి సామర్ధ్యాలతో తన కంపెనీని చిన్న స్థాయి నుండి ఎన్నో శాఖలున్న కంపెనీగా తీర్చిదిద్దాడు.

అభిజిత్ ఆఫీస్ నుంచి బయటకు వస్తుంటే మేనేజర్ ఎదురుపడ్డాడు. అభిజిత్‌ని జూడగానే అతనికి కొన్ని సంతకాలు తీసుకోవలసిన విషయం గుర్తొచ్చింది. కానీ ఈ సమయంలో పిలిస్తే బాస్ ఎలా రియాక్ట్ అవుతాడో అతనికి బాగా తెలుసు. అందుకే అభిజిత్‌ని పిలిచే సాహసం చెయ్యలేకపోయాడు.

అభిజిత్ మెట్లు దిగి తన కారు దగ్గరికి వెళ్ళబోతుంటే రోడ్డు పక్కన ఒక దృశ్యం అతన్ని ఆకర్షించింది. అక్కడ రోడ్డు పక్కన కొందరు గిరిజనులు వెదురుతో అల్లిన బుట్టలూ, టోపీల లాంటి వస్తువులు అమ్ముతున్నారు. వెదురు టోపీ అంటే ప్రవల్లికకి ఎంతో ఇష్టం. ఏదో సినిమాలో హీరోయిన్ పెట్టుకుంటే చూసిందట. అప్పట్నుంచీ అలాంటి వెదురు టోపీ కావాలని పట్టుబట్టింది. ఆ హీరోయిన్ కన్నా నువ్వే అందంగా ఉంటావని తను ఎంతో చెప్పి చూసాడు. వింటేగా. చిన్నపిల్లలా మంకుపట్టు పట్టి తనని హైదరాబాద్ లోని షోరూములన్నీ తిప్పించింది. కానీ ఎక్కడా దొరకలేదు. చివరికి శిల్పారామంలో జరిగిన హస్తకళల ఎగ్జిబిషన్‌కి కూడా వెళ్లారు. అక్కడ కూడా దొరకలేదు. ప్రవల్లికైతే ఆశ వదిలేసుకుంది. తను మాత్రం ప్రయత్నం చేస్తూనే ఉన్నాడు ప్రవల్లికని సర్ప్రైజ్ చెయ్యటానికి. ఎన్ని పెద్ద షోరూములు తిరిగినా దొరకని ఒక వస్తువు ఈ రోజు ఇలా తన ఆఫీస్ ముందే దొరకటం, చాలా నవ్వొచ్చింది అభిజిత్ కి.వెంటనే వెళ్ళి ఒక టోపీ తీసుకుని 100 రూపాయల నోటిచ్చాడు. చిల్లర ఇవ్వబోతుంటే ఉంచుకోమన్నట్టు సైగ చేసి వెనుదిరిగగాడు.

“ఇది చూస్తే ప్రవల్లిక ఎంత ఆనందపడుతుంది. ఇది తనకు వెంటనే ఇవ్వకుండా ఉడికించాలి” అనుకుంటూ కార్ స్టార్ట్ చేసాడు. ప్రవల్లికని ఉడికించటమంటే చాలా ఇష్టం అభిజిత్‌కి. అలా ఉడుక్కున్నప్పుడు కందగడ్డలా ఎర్రగా మారిన ఆమె ముఖాన్ని చూడటమంటే మరీ ఇష్టం. అలా ప్రవల్లిక గురించే ఆలోచిస్తూ, కార్‌ని ఒక ఫ్లోరిస్ట్ షాపు ముందు ఆపి కిందకు దిగాడు. అతను షాపులోకి ప్రవేశించగానే ఆ షాపు యజమాని స్నేహపూర్వకంగా నవ్వి, అప్పటికే అతనికోసం సిద్ధంగా ఉంచిన ఒక చిన్న ఫ్లవర్ బంచ్‌ని అతని చేతికి అందించాడు. నాలుగు ఎర్రగులాబీలతో అందంగా తయారు చేసిన ఫ్లవర్ బంచ్ అది. దాన్నందుకుని అతనికి డబ్బులు చెల్లించి తిరిగి కారెక్కాడు. ప్రవల్లికకి ఈ ఎర్రగులాబీలంటే ఎంతో ఇష్టం. ఏ రోజన్నా ఇవి మర్చిపోతే తను చేసే మారాం అంతా ఇంతా కాదు. అంతెందుకు తను 6 గంటలకి ఒక్క నిమిషం లేట్‌గా వెళ్ళినా తను చేసే గొడవ చూడాలి. దేవి గార్ని ప్రసన్నం చేసుకోవాలంటే తల ప్రాణం తోకకొస్తుంది.

అభిజిత్ ఇక గమ్యస్థానం చేరుకుంటాడనగా రెడ్ సిగ్నల్ పడింది. కారు ఆపుచేసి చుట్టూ చూస్తున్న



Telugu Jyothi Special Issue April 08

అభిజిత్‌కి అక్కడ ఆగి ఉన్న వాహనాల దగ్గరకొచ్చి అడుక్కుంటున్న ఒక ఆరేళ్ల పిల్లాడు కనిపించాడు. వాణ్ణి చూసే సరికి అతని ఆలోచనలు నాలుగు నెలలు వెనక్కి వెళ్ళాయి. ఒకసారి తనూ ప్రవల్లిక షాపింగ్ నుంచి వస్తుంటే దారిలో ఇదే పిల్లాడు అడుక్కుంటూ కనపడ్డాడు. తను యధాలాపంగా ఒక రూపాయి ఇవ్వబోయాడు. కానీ ప్రవల్లిక తనని చెయ్యి పట్టుకుని ఆపింది. తను చిరాగ్గా చూసాడు మరీ అంత పిసినారితనం పనికిరాదన్నట్టుగా.

ప్రవల్లిక అదేమీ పట్టించుకోకుండా ఆ పిల్లాడివైపు తిరిగి “మాతో పాటు వస్తావా? భోజనం పెడతాను” అని అడిగింది. వాడు తల అడ్డంగా ఊపి తనకి భోజనం వద్దు, డబ్బులే కావాలని అన్నాడు.

“సరే. ఏం చేస్తావురా ఆ డబ్బుల్తో?” అడిగింది ప్రవల్లిక.

“పాన్ పరాగ్ కొనుక్కుంటాను” అమాయకంగా చెప్పాడు వాడు.

వాడి మాటలకి కోపం పట్టలేక వాణ్ణి కొట్టడానికన్నట్టు చెయ్యెత్తింది ప్రవల్లిక. వాడి చెంప చెళ్ళుమనుండేదే అభిజిత్ ఆపకపోతే.

ఇదంతా చూసి ఆ పిల్లాడు మెల్లగా జారుకున్నాడు.

“చూడు అభి. పిల్లలెలా పాడయిపోతున్నారో” బాధగా అంది ప్రవల్లిక.

“వాడు ఎలా పోతే నీకేంటి? ఇవ్వాలనిపిస్తే ఓ రూపాయివ్వు. లేకపోతే వదిలెయ్. ఎందుకంత బాధ?” అన్నాడు అభిజిత్ విసుగ్గా.

ఆశ్చర్యంగా చూసింది ప్రవల్లిక. “వాడికి నిజంగా మేలు చెయ్యాలని నీకు అనిపిస్తే వాడికి భోజనం పెట్టు. లేదా వాడికేదన్నా పని చూపించు. అంతేగానీ ఇలా వాడికి రూపాయో, రెండు రూపాయలో ఇస్తే వాడు చెడిపోవటానికి నువ్వు పరోక్షంగా సాయం చేసినట్టే” కోపంగా అంది.

ఈసారి ఆశ్చర్యపోవటం అభిజిత్ వంతయ్యింది. “తనతో చిన్న చిన్న విషయాలకి గొడవపెట్టుకునే ప్రవల్లికలో ఇంత సామాజిక స్పృహ ఉందా?”

అప్పటిదాకా ఆమె చిలిపితనాన్నీ, అమాయకత్వాన్నీ ప్రేమించిన అతను అప్పటినుంచీ ఆమె వ్యక్తిత్వాన్ని కూడా ప్రేమించటం మొదలుపెట్టాడు.

“కానీ ఇంత మెచ్యూర్డ్‌గా ఆలోచించగలిగిన ప్రవల్లిక ఒక్కోసారి చిన్న పిల్లలా ప్రవర్తిస్తుంది ఎందుకు? తను ఎప్పుడైనా కసిరినా, కోపంగా ఒక చిన్న మాట అన్నా చిన్నపిల్లలా ఏడ్చేస్తుంది. అసలు ప్రవల్లిక తనకి పూర్తిగా ఎప్పుడన్నా అర్థమైతే కదా? A woman's heart is a deep ocean of secrets అని ఏ కవి అన్నాడో కానీ అది అతనికి కూడా అనుభవంలోకి వచ్చింది. పూర్వం మన కవులు చాలామంది ఒకే కావ్యానికి రెండు మూడు అర్థాలు వచ్చేలా శ్లేషకావ్యాలు రాసేవారట. మరి స్త్రీ అనే ఈ శ్లేషకావ్యానికి అర్థాలెన్నో సృష్టించిన ఆ దేవుడికైనా పూర్తిగా తెలుసో లేదో?”

తన వెనకాల మోగుతున్న హారన్ మోతలతో ఈ లోకంలోకొచ్చిన అభిజిత్ కారుని ముందుకి దూకించాడు. కొంచెం సేపటికి తను చేరవలసిన ప్రదేశం వచ్చేసింది. అక్కడ అంతా ప్రశాంతంగా ఉంది. అతను కారు దిగి ఏ మాత్రం తడుముకోకుండా స్ట్రెయిట్‌గా వెళ్ళి ఒక చోట ఆగాడు. అక్కడ ఒక నల్లటి గ్రానైట్ రాయి మీద బంగారు రంగులో అక్షరాలుమెరుస్తున్నాయి.



Telugu Jyothi Special Issue April 08

ప్రవల్లిక
W/o అభిజిత్
జననం 19-1-1982
మరణం 20-3-2007

దాని క్రింద పాలరాతితో ఒక బేస్ కట్టబడి ఉంది.

అభిజిత్ తను తెచ్చిన టోపీ, గులాబీ పులూ బేస్ మీద పెట్టాడు. ఆ బేస్మెంట్ మీద అతనికి తన భార్య ప్రవల్లిక కనిపిస్తోంది. ఆ బేస్మెంట్ దగ్గర క్రింద కూర్చుని ఆమెతో మాట్లాడుతున్నట్టే బేస్మెంట్‌తో మాట్లాడసాగాడు.

ఒక నెల క్రితం ప్రవల్లిక యాక్సిడెంట్‌లో చనిపోయిన దగ్గిరి నుంచి అభిజిత్ ఇలానే చేస్తున్నాడు. మొదట్లో అందరూ అతనికి పిచ్చెక్కిందేమో అనుకున్నారు. అందరూ అతనికి ప్రవల్లిక చనిపోయిందని నచ్చచెప్పటానికి చాలా ప్రయత్నించారు.

"తను ప్రాణానికి ప్రాణంగా ప్రేమించిన ప్రవల్లిక చనిపోయిందా?'' నమ్మబుద్ధి కాలేదు అభిజిత్‌కి.

"చివరి దాకా తోడుంటానని మాటిచ్చింది కదా? ఇప్పుడు తననిలా ఒంటరిగా వదిలేసి వెళ్ళిపోతుందా? అయినా ప్రవల్లిక తనని వదిలి ఎక్కడికి వెళ్ళింది? తను వేసే ప్రతి అడుగులో తన వెనకాలే వస్తుంది. తన శ్వాసలో నిక్షిప్తమై తనకి జీవనాధారం అయ్యింది. తన విజయంలో ప్రోత్సహిస్తూ, ఓటమిలో వెన్నుతడుతూ నిత్యం తనతోనే ఉంది. నేను కాదు పిచ్చి వాణ్ణి. ప్రవల్లిక చనిపోయిందని చెప్తున్న వీళ్ళంతా పిచ్చివాళ్ళు.''

ఇక అతను ఎవ్వరి మాటలూ పట్టించుకోదల్చుకోలేదు.

అభిజిత్ రోజూ తన ప్రవల్లికని కలుస్తూనే ఉన్నాడు. ప్రేమకు మరణం లేదు.

***భాను***

స్వస్థలం మంగళగిరి, గుంటూరు జిల్లా, హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్.

---

ఓ నవనీత కోమల వయో రుచిరాంగి యనుగ్రహింపు ప్రే
మానుమితాస్మదీయ వచనావళులన్ భవదార్ద్ర రాగ స
న్మానితుడైన యీ కవికుమారుని పల్కులు నీ మనోజ్ఞ నే
త్రాను గతాచ్ఛ శోభనము లందుకొనందల లెత్తవేనియున్!

**అబ్బూరి**

Telugu Jyothi Special Issue April 08